క్లుప్తంగా

కస్తూర్బాలో ఇంటర్ ప్రవేశానికి ఆహ్వానం

కూసుమంచి: మండలంలోని కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ గ్రూపులో 23 సీట్లు ఖాళీగా ఉండగా స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఓ అజితకుమారి తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 28న జరిగే స్పాట్ అడ్మిషన్లకు పదో తరగతి మెమోతో పాటు టీసీ, స్టడీ కండక్ట్, కుల, ఆధాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు, పాస్ ఫొటోలను తమ వెంట తీసుకరావాలని సూచించారు.

సామూహిక అన్నప్రాసన

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 46వ డివిజన్ పరిధిలోని జూబ్లీపుర అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సామూహిక అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆహారపు అలవాట్లు, పోషణ సంబంధిత విషయాలు నేర్పబడతాయన్నారు. అంగన్‌వాడీ టీచర్ సంధ్య, హెల్పర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

రేపు నెలనెలా వెన్నెల

ఖమ్మంగాంధీచౌక్: నెల నెలా వెన్నెల అభ్యుదయ సాంస్కృతిక 96వ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు, నాగబత్తిని రవి, వేల్పుల విజేత, వేముల సదానందం, నామ లక్ష్మీనారాయణలు శుక్రవారం తెలిపారు. చెరుకూరి రామారావు రచన, దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'కిడ్నాప్'నాటికను ఉషోదయ కళానికేతన్ కట్రపాడు కళాబృందం ప్రదర్శించనుందని తెలిపారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న వెంకన్న

కామేపల్లి: తెలంగాణ రాష్ట్ర వంశరాజ్ కుల సంక్షేమ సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా తాళ్లగూడెం గ్రామానికి చెందిన సింగం వెంకన్న నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇరిగిజ్జ మురళీకృష్ణ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. సంఘం ఆశయాలను సాధించేందుకు కృషి చేస్తానని వెంకన్న తెలిపారు.

ఎన్‌సీసీ కేడెట్లకు ర్యాంకులు

ఖమ్మం రాపర్తినగర్: నగరంలోని ఎన్‌సీసీ కార్యాలయంలో శుక్రవారం జిల్లాస్థాయిలో ఎన్‌సీసీ కేడెట్లకు ర్యాంకులు ప్రకటించినట్లు 11వ తెలంగాణ బెటాలియన్ కమాండెంట్ సంజయ్ భద్ర తెలిపారు. జిల్లాలో వివిధ కేటగిరిలో శిక్షణ తీసుకుని ఉత్తమ కేడెట్లుగా నిలిచిన వారికి ర్యాంకులు ప్రకటించినట్లు చెప్పారు. ఇందులో డీఆర్ఎస్ కళాశాలకు చెందిన కేడెట్లు జి.మనోజ్‌కుమార్, స్వర్ణజిత్, సీహెచ్.చందన ఉండగా..కళాశాల యాజమాన్యం వి.మోహన్‌రెడ్డి, వి.శోభ, ప్రిన్సిపాల్ టి.నాగేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

కోతులకు కళ్లెం..!

నగరంలో కోతుల సమస్యకు పరిష్కారం లభించింది. గత కొంతకాలంగా నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో కోతుల బెడద తీవ్రరూపం దాల్చగా.. అధికారులు వాటికి చెక్ పెట్టేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. నెల్లూరుకు చెందిన కోతులు పట్టే నిపుణులను సంప్రదించి వారికి కాంట్రాక్ట్ అప్పగించారు. దీంతో నగరంలో కొద్ది రోజులుగా కోతులు పట్టే పనిలో నిమగ్నమయ్యారు.

– ఖమ్మంగాంధీచౌక్



మంకీట్రాప్‌లో చిక్కిన వానరాలు

వానర బెడదకు ప్రత్యేక ప్రణాళిక

- ఫలిస్తున్న మంకీ ట్రాప్‌లు
- ఖమ్మంలో వెయ్యి కోతుల పట్టివేత
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌తో సమస్యకు చెక్
- నెల్లూరు బృందానికి కాంట్రాక్ట్

వణికిస్తున్న వానరాలు..

నగరంలో కోతుల బెడద ఎక్కువైంది. కోతుల గుంపు వస్తే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారి చేతిలో బ్యాగులు, కవర్లు, లంచ్‌బాక్స్‌లు కనిపిస్తే చాలు వారిని వెంబడించి మరీ లాక్కొంటున్నాయి. ఇలా రోజూ విద్యార్థులు, నగరవాసులు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. ఇక వ్యాపారుల పరిస్థితి మరింత దయనీయమనే చెప్పొచ్చు. గ్రామాల్లో కొందరు కోతుల నుంచి రక్షణగా కుక్కలు పెంచుకుంటుంటే, మరికొందరు ప్రమాదం లేని గన్నుల మోత మోగించడం, కొండముచ్చుల బొమ్మలతో బెదిరింపులు చేస్తున్నారు. ఇదంతా తాత్కాలిక సేఫ్టీ కోసమే కాని శాశ్వత పరిష్కారానికి నోచుకోవడం లేదు. కాగా, స్థానిక సమస్యలపై 'సాక్షి'కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించగా.. స్పందించిన ఆయన పలువురు అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

ఫలిస్తున్న ఫోన్‌ఇన్..

ఖమ్మం నగర కమిషనర్‌తో ఇటీవల 'సాక్షి'ఆధ్వర్యాన నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో నగరం నలుమూలల నుంచి కోతుల బాధితులు తమ సమస్యలను వివరించారు. దీంతో స్పందించిన ఆయన ఇదే తడవుగా వెంటనే కోతులు పట్టే వారిని పిలిపించి ప్రక్రియకు చర్యలు తీసుకున్నారు. దీంతో కోతుల సమస్య తీరుతున్నందున నగర బాధితులు 'సాక్షి' కృషిని, కమిషనర్ చర్యలను ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

ప్రత్యేక ప్రణాళికతో..

నగరంలో కోతులను పట్టేందుకు మున్సిపాలిటీ అధికారులు నెల్లూరుకు చెందిన బృందానికి కాంట్రాక్ట్ అప్పగించింది. దీంతో ముందుగా వానర సైన్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రదేశాల్లో కోతులను పట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు ప్రత్యేకంగా ఇనుప తీగలతో రూపొందించిన మంకీ ట్రాప్‌లు ఫలితాన్నిస్తున్నాయి. వీటిని కోతుల స్థావరాల వద్ద ఉంచి అందులో వేరుశనగ గింజలు వేస్తుండగా.. వాటిని తినేందుకు వచ్చి పట్టుబడుతున్నాయి. దీనికోసం మూడు, నాలుగు రోజుల పాటు శనగగింజలు వేస్తూ మచ్చిక చేసుకుంటున్నారు. ఆతర్వాత తినేందుకు రాగానే ఓ తీగ సాయంతో దూరం నుంచి బందిస్తున్నారు.



కోతుల కోసం ఏర్పాటు చేసిన మంకీట్రాప్

ఒక్కో ట్రాప్‌లో 200 కోతులు ఆపైన కూడా బందీ చేసే అవకాశం ఉంది. ఇలా నగరంలో కొద్ది రోజులుగా వెయ్యి కోతులను పట్టారు. ఈక్రమంలో శ్రీనివాస్‌నగర్‌లోని చింతల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ట్రాప్‌లో శుక్రవారం 100 కోతులు చిక్కగా.. వాటిని ఓ వాహనంలో దూర ప్రాంతాలకు తరలించి వదులుతున్నారు. అయితే ఆ కోతులను పట్టినట్లుగా గుర్తించేందుకు వాటిపై ఓ రంగుతో గుర్తులు వేస్తున్నారు.

చక్కని పరిష్కారం..



కోతులతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. మంకీట్రాప్‌లు ఏర్పాటు చేసి పట్టుకోవడం కొంత మేర సమస్య తీరుతుందని భావిస్తున్నాం. అందరి కృషి ఫలితంగా కోతుల సమస్యకు పరిష్కారం దక్కిందని చెప్పొచ్చు.

– శ్రీనివాసరావు, శ్రీనివాసనగర్

కట్టుదిట్టంగా అమలు చేయాలి



కోతుల సమస్యకు చేపట్టిన ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయాలి. వాటి ఉత్పత్తిని నియంత్రించే చర్యలు తీసుకుంటే మంచిది. మంకీ ట్రాప్‌లను నిరంతరాయంగా నిర్వహిస్తే మున్ముందు మళ్లీ వాటి బెడద ఉండదు.

– రాహుల్ నాయక్, త్రీటౌన్

ప్రణాళికతో పడుతున్నాం..



కోతులు పట్టేందుకు మొదటగా అవి ఉండే ప్రాంతాలను గుర్తిస్తాం. ఆతర్వాత వాటి స్థావరాల వద్ద మంకీ ట్రాప్‌లు ఏర్పాటు చేసి మూడు రోజుల పాటు ఆహారాన్ని ట్రాప్‌లలో వేసి మచ్చిక చేసుకుంటాం. అవి ఎక్కువ సంఖ్యలో చేరగానే బందించి అధికారులు తెలిపిన విధంగా అటవీ ప్రాంతాల్లో వదిలేస్తున్నాం.

– రమేష్, మంకీ ట్రాప్ నిర్వాహకుడు

వరదలపై అప్రమత్తత అవసరం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లాతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మున్నేరు పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులకు సూచించారు. శుక్రవారం కేఎంసీలోని తన చాంబర్‌లో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు మున్నేరు వరద స్థితిని అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అవసరమైతే ముంపు ప్రాంతాల నుంచి పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు.



సమీక్షిస్తున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

నిర్లక్ష్యం చేయొద్దు..

ఖమ్మంమయూరిసెంటర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మున్నేరుకు వరద పెరుగుతున్నందున కేఎంసీ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో కార్పొరేషన్ నిబంధనలకు తూట్లు పొడిచి ఇళ్లు, బిల్డింగ్‌లు, వర్తక వ్యాపారాలు చేసుకోవడానికి అనుమతులు ఇవ్వడం ఫలితంగానే గతేడాది తీవ్రంగా ఆస్తి నష్టం జరిగిందని ఆరోపించారు. ఇప్పటికైనా అక్రమంగా నిర్మించిన భవనాలపై చర్యలు తీసుకోవాలని, రిటైనింగ్ వాల్‌ను తగు జాగ్రత్తలతో త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎస్.నవీన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, నాయకులు బొంతు రాంబాబు, బండారు రమేష్, ఎం.ఏ.జబ్బార్, దొంగల తిరుపతిరావు, మీరా సాహిబ్, నాగులు మీరా, బోడపట్ల సుదర్శన్, భుక్యా శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారికి ఇవ్వాల్సిన మిడ్ లెవెల్ హెల్త్ వర్కర్ల పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారికి ఇవ్వడం తగదన్నారు. అనంతరం ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఎన్నుకోగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కొత్తపల్లి అలేఖ్య, బండారు ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా బొజ్జ ప్రతిభా భారతి, ఆరం సంధ్య, సహాయ కార్యదర్శులుగా డప్పు కల్యాణి, ఆకారపు రాజేష్, కోశాధికారిగా ఆలకుంట దేవేందర్‌లతో పాటు మరో 11 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బీ.జీ.క్లెమెంట్, తెలంగాణ రాష్ట్ర ఎం.ఎల్.హెచ్.పీ యూనియన్ గౌరవాధ్యక్షుడు తోట రామాంజనేయులు, ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు రావి శివరామకృష్ణ, ఉపాధ్యక్షురాలు సీహెచ్ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ

తిరుమలాయపాలెంలో ఎంపీటీసీ స్థానాల ఖరారు

తిరుమలాయపాలెం: మండలంలోని 40 గ్రామ పంచాయతీలు ఉండగా 18 ఎంపీటీసీ స్థానాలను ఎంపిక చేసి అధికారులు ఓటర్ల జాబితాన సిద్ధం చేశారు. బచ్చోడు ఎంపీటీసీ స్థానంలో బచ్చోడు, బచ్చోడుతండా, హస్నాబాద్ నుంచి 3,938 మంది ఓటర్లు, బీరోలులో బీరోలు, ఏలువారిగూడెం నుంచి 4,022మంది, ఎదుళ్లచెరువులో ఎదుళ్లచెరువు, బాలాజీనగర్‌తండా నుంచి 1,268, హైదర్‌సాయిపేటలో హైదర్‌సాయిపేట, అజ్మీరతండా, తిప్పారెడ్డిగూడెం, పడమటితండా నుంచి 3,645, జల్లెపల్లిలో జల్లెపల్లి, జోగులపాడు, చంద్రుతండా నుంచి 2,863 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే, జూపెడలో జూపెడ, రఘునాథపాలెం, లక్ష్మీదేవిపల్లి నుంచి 2,981మంది, కాకరవాయిలో 3,184మంది, కొక్కిరేణిలో కొక్కిరేణి, ఎర్రగడ్డ నుంచి 2,650మంది, మేడిదపల్లిలోని మేడిదపల్లి, మేకలతండాలో 2,545మంది, మహ్మదాపురంలోని మహ్మదాపురం, ఇస్లావత్‌తండాలో 2,727మంది, పైనంపల్లిలోని పైనంపల్లి, సోలీపురం, రాజారంలో 3,010మంది, పాతర్లపాడులోని పాతర్లపాడు, గోల్‌తండాలో 2,893 మంది, పిండిప్రోలులోని పిండిప్రోలు, కేశ్వాపురంలో 3,991మంది, సుబ్లేడులో 2,644 మంది, తెట్టెలపాడులోని తెట్టెలపాడు, దమ్మాయిగూడెంలో 2,947మంది, తాళ్లచెరువులోనితాళ్లచెరువు, తిమ్మక్కపేటలో 1,208మంది, తిరుమలాయపాలెంలో 2,414మంది, ఏనెకుంటతండాలోని ఏనెకుంటతండా, మంగళిబండతండా, సుద్దవాగుతండాలో 1,793 మంది ఓటర్లు ఉన్నారు.

వ్యవసాయ రంగం నిర్వీర్యం..



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

నేలకొండపల్లి: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక సంస్కరణల కారణంగా దేశంలో వ్యవసాయ రంగం నిర్వీర్యమవుతుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని ప్రధాని మోదీ అమెరికా కార్పొరేట్ కంపెనీలకు తాకట్టుపెడుతున్నారని, దీంతో రైతుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందన్నారు. కేంద్ర వ్యతిరేక విధానాలకు ఆగస్టు 13న దేశవ్యాప్తంగా రైతు సంఘాల ఆధ్వర్యాన నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఇంటూరి అశోక్, రచ్చా నరసింహారావులతో పాటు 14 మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఈ సభలో జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, నాయకులు నాగేశ్వరరావు, కే.వీ.రెడ్డి, దండా సూర్యనారాయణ, యలమద్ది లెనిన్, ఎడ్ల తిరపరావు, దుగ్గి నరసింహారావు, నర్సయ్య, వీరు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో కుంకుమ పూజలు



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

ఖమ్మంగాంధీచౌక్: శ్రావణ మాసం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. మహిళలు తెల్లవారుజామునే లేచి ఇళ్లను శుభ్రపరచుకుని అమ్మవార్లకు పూజలు చేశారు. త్రీటౌన్ ట్రంక్ రోడ్‌లోని శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ గుంటు మల్లేశ్వరస్వామి ఆలయంలో గోమాతకు పూజలు నిర్వహించాక సామూహిక కుంకుమ పూజలో పాల్గొనగా.. పూజా సామగ్రిని ఆలయ నిర్వాహకులు ఉచితంగా అందించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి చుండూరు రామకోటేశ్వరరావు, అర్చకులు దాములూరి వీరభద్రరావు, దాములూరి కృష్ణశర్మ పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

నేలకొండపల్లి: కార్మికులు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పగిడికత్తుల రామదాసు మాట్లాడుతూ..కార్మికుల హక్కుల కోసం ఈ నెల 31న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దపాక వెంకన్న, పసుపులేటి సైదులు, పిచ్చయ్య, హీరాలాల్, వెంకటేష్, అనిత, వీరుకమారి, దుర్గారావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చెరుకు తోటలోకి చేరిన వరద

నేలకొండపల్లి: అధికారుల నిర్లక్ష్యంతో తాను చెరుకు తోట కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురవుతోందని మండలంలోని అమ్మగూడెంకు చెందిన రైతు అడపాల రమేష్‌బాబు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆయన నందిగామ బ్రాంచ్ కెనాల్ సమీపాన రెండున్నర ఎకరాల్లో చెరుకు సాగు చేస్తున్నాడు. అయితే, కెనాల్ పక్కన పంట కాల్వలు లేకపోవడంతో వరద ఆయన పొలంలోకి చేరుతోంది. అలాగే, మరో రైతు ర్యాంపు ఏర్పాటు చేసుకోగా, నీరంతా రమేష్ పొలంలోనే నిలుస్తోంది. దీంతో రూ.2 లక్షల పెట్టుబడి పెట్టిన చెరుకు తోట కుళ్లిపోయే స్థితికి చేరినందున అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశాడు.

వనమహోత్సవం

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మంసహకారనగర్/నేలకొండపల్లి: నగరంతో పాటు నేలకొండపల్లి పాఠశాలలో పలువురు మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. ఈనేపథ్యాన శుక్రవారం నగరంలోని ప్రధాన రహదారుల మధ్యగల డివైడర్లలో వక్క (ఆరెకానట్) మొక్కలను కేఎంసీ ఉద్యాన అధికారిణి బెల్లం రాధిక నాటించారు. అలాగే కాల్వొడ్డు శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవాలయంలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆలయ నిర్వాహకులు మొక్కలు నాటారు. విద్యాక్షేత్ర పాఠశాల ఆధ్వర్యాన నిర్వహించిన గ్రీన్‌డే కార్యక్రమంలో భాగంగా పాఠశాల కరస్పాండెంట్ సౌభాగ్య స్థానిక కార్పొరేటర్ కూరాకుల వలరాజుతో కలిసి మొక్కలు నాటారు. అదేవిధంగా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు పాఠశాల విద్యార్థి షేక్ కుదుష్యా పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటారు.



ఖమ్మంగాంధీచౌక్: కాల్వొడ్డు ఆంజనేయ స్వామి ఆలయంలో మొక్క నాటుతున్న ఆలయ నిర్వాహకులు



ఖమ్మం సహకారనగర్: విద్యాక్షేత్రలో మొక్క నాటుతున్న కార్పొరేటర్ వలరాజు

ప్రయాణం.. ప్రయాస

- కొట్టుకుపోయిన ఖమ్మం–ఇల్లెందు అప్రోచ్ రోడ్డు
- బురదలో ఇరుక్కుంటున్న వాహనాలు
- మధ్యలోనే ఆగిన రూ.38.8 కోట్ల పనులు

రఘునాథపాలెం: ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారిపై రాకపోకలు నరకయాతనగా మారాయి. రఘునాథపాలెం నుంచి బూడిదంపాడు వరకు డబుల్ లైన్ రోడ్డును నాలుగు లైన్ల రోడ్డు, డివైడర్ల నిర్మాణం పనులు గత కొన్ని నెలల క్రితం వరకు సాగాయి. మంచుగొండ గ్రామ శివారులో నడుస్తున్న రహదారి విస్తరణ పనుల్లో కల్వర్టును తొలగించి అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేసి విస్తరణకు అనుగుణంగా కల్వర్టును నిర్మాణం చేపట్టారు. ఆపని పూర్తిస్థాయిలో కాకపోవడంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ అప్రోచ్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో పలు వాహనాలు ప్రయాణించే సమయాన బురదలో ఇరుక్కుని ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తున్నాయి. రూ.38.80 కోట్లతో నిర్మాణ పనులు మొదలు పెట్టి ఏడాది అవుతున్నా ఇంకా పూర్తి కాలేదు. సుమారు రూ.5 కోట్ల పెండింగ్ బిల్లు ఉండడంతో మధ్యలోనే కాంట్రాక్టర్ పనులు వదిలేసినట్లు సమాచారం. కాగా, వాహనాలు దిగబడకుండా అధికారుల బృందం బురదను తొలగించి తాత్కాలికంగా మరమ్మతులు చేయగా.. రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి.



బురదలో కూరుక్కుపోయిన వాహనాలు, వాహనదారుల అవస్థలు

సీపీఎం ఆధ్వర్యాన నిరసన..

ఖమ్మం నుంచి ఇల్లెందుకు వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ పనులు అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. శుక్రవారం పార్టీ ప్రతినిధి బృందం రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. నాసిరకం పనులు చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, త్వరితగతిన రహదారి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు గూగులోత్ కుమార్, షేక్ ఇమామ్, రహీం, ఖాధర్, రవీందర్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు, ఉద్యోగులు

ఖమ్మం మామిళ్లగూడెం: రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెరుగుదల నిరోధక చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ టీపీఆర్‌పీఏ ఆధ్వర్యాన ఖమ్మం అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా టీపీఆర్‌పీఏ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పెన్షనర్లకు 8వ పీఆర్సీ ప్రయోజనాలు బీఎస్‌ఎన్‌ఎల్‌తో పాటు ప్రభుత్వ అటానమస్ సంస్థల ఉద్యోగులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం వచ్చే నెల నుంచి దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గోపీచంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వి.మల్లికార్జునరావు, ఆర్.శ్రీరాములు, రాజశేఖర్, ఎస్.నాగేశ్వరరావు, ఝాన్సీ, చిట్టెమ్మ, భారతి, ఉమాదేవి, పద్మకుమారి, ప్రతాప్, మీరాఖాన్, రామారావు, మురహరిరావు, ఆంజనేయులు, లోకేశ్వరరావు, వీరభద్రం సాంబయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ ప్రారంభం



ఇళ్ల పత్రాలు అందిస్తున్న కార్పొరేటర్ మురళి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 57 డివిజన్లకు సంబంధించిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీని శుక్రవారం నుంచి అధికారులు ప్రారంభించారు. మొదటి దశలో 2,300మందిని ఎంపిక చేయగా.. 1,800 మందికి ఇవ్వనున్నారు. వీటిని పంపిణీ చేసేందుకు ఆయా వార్డు ఆఫీసర్లకు అధికారులు దిశనిర్దేశం చేయగా.. శుక్రవారం 24వ డివిజన్ కార్పొరేటర్ కమర్తపు మురళి తన డివిజన్‌లోని 15 మందికి పత్రాలను అందజేశారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి



రాంనారాయణను సన్మానిస్తున్న జర్నలిస్టులు

ఖమ్మం సహకారనగర్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావులు తెలిపారు. శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డులు తదితర సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ, నాయకులు మురహరిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రవీంద్రశేషు, వెంకట్రావు, శివానందం, వనం వెంకటేశ్వర్లు, ఎల్రక్టానిక్ మీడియా అధ్యక్షుడు మామిడాల భూపాల్ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

ఖమ్మం మామిళ్లగూడెం: గత ఏడాదికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికే పరిమితమైన ఖమ్మంకు చెందిన సీపీఎం కార్యకర్త నాగులమీరాకు ఆపార్టీ 52వ డివిజన్ కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ మాట్లాడుతూ.. ఆ డివిజన్ పార్టీ నాయకుడు సుభాష్ సహకారంతో రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలు అందించినట్లు తెలిపారు. తమ పార్టీ ప్రజా పోరాటాలతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎస్.నవీన్‌రెడ్డి, టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, దాత సుభాష్, నాయకులు ఎస్‌కె.చిన్న హుస్సేన్, ఏఎం రెడ్డి, సీహెచ్.భద్రం, ఎస్‌కె.పెద్ద హుస్సేన్, ఎకె.షఫీ, ఎస్‌కె.బుడెన్ తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తి రిమాండ్

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాలలో ఇటీవల నలుగురిపై సర్జికల్ బ్లేడ్‌తో దాడి చేసిన వ్యక్తిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామానికి చెందిన రెంటాల గోపీకి మాలప్రోలు క్రాంతి ఆటో అద్దె డబ్బు ఇవ్వడం లేదని బ్లేడ్‌తో దాడికి యత్నించాడు. అక్కడే ఉన్న శ్యాంసుందర్, రాహుల్, నాగేశ్వరరావు, సాయి అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిపై బ్లేడ్‌తో దాడి చేసి పారిపోయాడు. బాధితుల ఫిర్యాదుతో గోపిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

వానరానికి అంత్యక్రియలు

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువులో శుక్రవారం ఓ వానరం విద్యుత్‌ఘాతంతో మృతిచెందింది. ఈనేపథ్యాన గ్రామస్తులు వానరాన్ని గ్రామంలో ఊరేగించి అంత్యక్రియలను నిర్వహించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



జక్కేపల్లిలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏఓ

కూసుమంచి: మండలంలోని జక్కేపల్లి, కల్లూరిగూడెం సహకార సంఘాల్లోని ఎరువుల నిల్వలను శుక్రవారం ఏఓ రామడుగు వాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. వరినాట్లు ప్రారంభమైనందున రైతుల అవసరాల నిమిత్తం ఉదయం 8 గంటల నుండే ఎరువులను పంపిణీ చేయాలన్నారు. ఎరువుల విక్రయాన్ని పీఓఎస్ మిషన్ ద్వారా మాత్రమే జరపాలని, రైతు వారీగా యూరియా విక్రయాలను నమోదు చేసి రైతులకు స్టాక్ బోర్డులు కనపడేలా ఉంచాలన్నారు. అనంతరం జక్కేపల్లిలోని వరి పొలాలను ఏఓ పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు.